సాక్షి
పెద్దపల్లి

ఆదివారం । 23 । ఏప్రిల్ । 2023



సుల్తానాబాద్: వరదనీటిలో కొట్టుకుపోతున్న ధాన్యాన్ని చూస్తూ ఉండిపోయిన రైతు

మరోసారి ముంచిన వర్షం

● ఎలిగేడు మండలంలో రాళ్లవాన ● కల్లాల్లో తడిసిన ధాన్యం ● నేలవాలిన వరి పైరు ● భారీగా ఈదురుగాలులు

పెద్దపల్లి రూరల్: జిల్లా రైతులను వరుణుడు మరోసారి నిండా ముంచాడు. ప్రస్తుతం పొలాలు కోత దశలో ఉండగా.. అకాల వర్షంతో నేల వాలింది. కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన ధాన్యం తడిసి ముద్దయ్యింది. కల్లాల్లో ఆరబోసిన ధాన్యం కొట్టుకుపోయింది. మొత్తంగా అకాల వర్షం రైతులను అతలాకుతలం చేసింది. చేతికందిన పంటను అమ్ముకుందామన్న ఆశతో ఉన్న అన్నదాతల ఆశలను ఉరుములు, మెరుపులు, పిడుగులు, ఈదురుగాలులతో కూడిన వాన అడియాసలు చేసింది. పంటను కాపాడుకునేందుకు పరదా కప్పుతున్న పెద్దపల్లి మండలం గొల్లపల్లి (తుర్కలమద్దికుంట)కు చెందిన రైతు ఆవుల మహేందర్ పిడుగుపాటుతో చనిపోయాడు.



ధాన్యంరాశిపై వడగండ్లు..



సుల్తానాబాద్‌లో పరదాలు కప్పుతున్న రైతులు



సుల్తానాబాద్‌లో నీటిని తొలగిస్తున్న రైతు



ఎలిగేడు మండలం శివపల్లిలో రాలిపోయిన వరి గింజలు



ఎలిగేడులో నేలరాలిన వడ్లు

ఎలిగేడు: మండలంలో శనివారం సాయంత్రం భారీ ఈదురుగాలులతోకూడిన వర్షం కురిసింది. పలు గ్రామాల్లో రాళ్ల వాన పడడంతో వరి, మొక్క జొన్న, మామిడిపంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసి ముద్దయ్యింది. నారాయణపల్లి, బుర్హాన్‌మియాపేట, లాలపల్లి రాళ్లవాన బీభత్సం సృష్టించింది.

అన్నదాతల్లో ఆందోళన..

కాల్వశ్రీరాంపూర్: మండలవ్యాప్తంగా వరి పొలాలు కోతకు వచ్చాయి. శనివారం రాత్రి కురిసిన వర్షానికి మొత్తం నేలవాలాయి. ఒక్కసారిగా గాలి దుమారంతో కూడిన వర్షం రావడంతో రైతులు కొనుగోలు కేంద్రాలకు పరుగులు తీశారు. ధాన్యాన్ని కుప్ప చేసేలోపు వర్షం బీభత్సంగా కురవడంతో తడిసి ముద్దయినట్లు రైతులు తెలిపారు. తడిసిన ధాన్యాన్ని కొనాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

జూలపల్లిలో..

జూలపల్లి: మండలకేంద్రంతోపాటు గ్రామాల్లో వర్షం కురవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందారు. గురువారం రాత్రి భారీ ఈదురుగాలులకు మొక్కజొన్నకు తీవ్ర నష్టం వాటిల్లింది. తాజాగా మరోసారి అకాలవర్షం రావడంతో అన్నదాతలను తీవ్ర ఆందోళనకు గురి చేసింది.

నాడు మొక్కజొన్న.. నేడు వరిధాన్యం

ఓదెల: మండలంలోని ఓదెల, కొలనూర్, కనగర్తి, పొత్కపల్లి, గోపరపల్లె, ఇందుర్తి, గుంపుల కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. ఇటీవల వడగండ్ల వర్షానికి మొక్కజొన్న పంట పూర్తిగా నేలమట్టమైన విషయం తెల్సిందే. తాజాగా ధాన్యం పూర్తిగా తడవటంతో రైతులు లబోదిబోమంటున్నారు. టార్పాలిన్ కవర్లు అందుబాటులో లేకపోవడం, అకస్మాత్తుగా వర్షం కురవడంతో రైతులు పంటను కాపాడుకోలేకపోయారు.

పలుగ్రామాల్లో అంధకారం

అకస్మాత్తుగా వర్షం కురవడంతో గ్రామాల్లో అంధకారం నెలకొంది. కొలనూర్, ఓదెల, హరిపురం, ఉప్పరపల్లెలో కరెంట్ మూడు గంటలపాటు నిలిచిపోయింది. కొలనూర్ గొర్రె ఐలయ్యకు చెందిన పాడి గేదె పిడుగుపడి మృతిచెందింది. దాని విలువ సుమారు రూ.40వేలు ఉటుందని బాధిత రైతు తెలిపాడు.

అపార నష్టం

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్‌లో అకాల వర్షానికి అపారనష్టం వాటిల్లింది. పొలాల్లోనే గింజలు రాలిపోయాయి. ఈదురుగాలులకు భూపతిపూర్ శివారులో ఓ టేలా రాజీవ్ రహదారిపైకి కొట్టుకొచ్చింది. దుబ్బపల్లి నుంచి సుల్తానాబాద్ వరకు రాజీవ్ రహదారి వెంట ఉన్న చెట్లు విరిగి రోడ్డుపై పడ్డాయి. గర్రెపల్లిలో ఓ రేకులషెడ్డు కూలిపోయింది.

గంటలోనే బీభత్సం

సుల్తానాబాద్: 20 నిమిషాలపాటు వర్షం.. 10 నిమిషాలపాటు ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. చెట్లు విరిగిపోయాయి. పొలాలు నేల మట్టమయ్యాయి. వ్యవసాయ మార్కెట్ లో రైతులు ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. వరదనీటిలో ధాన్యం కొట్టుకపోయింది. నిలిచిపోయిన నీటిని తొలగించేందుకు రైతులు కాలువలు చేశారు. కొన్నిచోట్ల చెట్లు కూలిపోవడంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది.

వెంటనే కొనాలి



పొలం కోసినంక వచ్చిన నాలుగు ట్రాక్టర్ల ధాన్యాన్ని సెంటర్ల ఆరబోసిన. ధాన్యం ఆరుతుందను కుంటుండగా ఒక్కసారిగా వాన కురిసి ధాన్యం తడిసింది. కేంద్రాలను వెంటనే ప్రారంభించి ధాన్యం కొనాలి.

–మాదాసు భూమయ్య, పాలకుర్తి

పంట నష్టాలపాలే..



ఈ ఏడాది ఏసంగి పంట నష్టాలే. నాట్లు పడ్డంక వానలు పడి రోగాలు తగిలినయి. పొట్టకచ్చినంక వానలు పడి వరి పడిపోయింది. మెడవిరుపు రోగం తగిలి మరింత నష్టం అయింది. ఇప్పుడు కేంద్రాల్లో పోసినంక వర్షం పడి తడిసినయి.

– ఆషాడపు పోశాలు, కాల్వశ్రీరాంపూర్

ప్రతిరోజూ భయమే..



కోతలు పట్టే సమయంలోనే వాతావరణం సరిగా ఉంటలేదు. ఉదయమంతా ఎండలు.. సాయంత్రం గాలి దుమారం, వర్షం వస్తుండడంతో భయపడుతున్నం. ఎప్పుడు వర్షం వస్తదో, ఎప్పుడు ఎండకాస్తదో తెలియడం లేదు.

– మల్లెత్తుల మల్లేశం, రైతు, జూలపల్లి

రైతులను ఆదుకోవాలి



ధాన్యం కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలి. వచ్చిన ధాన్యాన్ని వచ్చినట్లే కొనాలి. అకస్మాత్తుగా వర్షం రావటంతో ధాన్యం తడిసి ముద్దయింది. రైతులకు వర్షాలతో దెబ్బమీద దెబ్బ పడుతున్నట్లయితంది.

– తాళ్లపల్లి సదయ్య, రైతు, కనగర్తి

తడిసి ముద్దయింది



మండలంలో వర్షానికి వరిధాన్యం పూర్తిగా తడిసి ముద్దయింది. సెంటర్‌లలో ధాన్యం పైన కప్పటానికి టార్పాలిన్ కవర్లు లేక పోవటంతో ఇంటికి పోయి వచ్చేసరికి తడిసింది. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

– దాసరి వెంకటేశ్, రైతు, ఓదెల

తడిసిన ధాన్యం కొనాలి



వర్షానికి తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనాలి. చేతికి వచ్చిన పంట మార్కెట్లో కొనుగోలు కోసం వరి ధాన్యాన్ని ఆరబెట్టాం. వర్షం రాకతో తార్పాలిన్లు లేక పోవడం మూలంగా ధాన్యం తడిచాయి.

– సుశీల, రాజేశం, అశోక్‌నగర్ సుల్తానాబాద్

కాంట్రాక్టు కార్మికుల ఒప్పందం అమలు చేయాలి

గోదావరిఖని: సింగరేణి కాంట్రాక్టు కార్మికుల ఒప్పందాన్ని అమలు చేయాలని కోరుతూ శనివారం డైరెక్టర్(పా) బలరామ్‌కు వినతి పత్రం అందజేశారు. 2022 సెప్టెంబర్‌లో 18 రోజుల సమ్మె సందర్భంగా డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ (సెంట్రల్) సమక్షంలో ఒప్పందం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కొత్తగూడెం సింగరేణి ప్రధాన కార్యాలయంలో సింగరేణి డైరెక్టర్ (పా) ఎన్.బలరాంను కలిసి వినతిపత్రం అందజేశారు. వారిలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నర్సింహారావు, నాయకులు బి.మధు, చంద్రశేఖర్, జి.శ్యామ్‌కుమార్, వెంకటేశ్వరరావు తదితరులున్నారు.



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఐఎంఏ భవన నిర్మాణానికి స్థలం ఇప్పించాలని వినతి

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రం పెద్దపల్లిలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) కార్యాలయ భవనాన్ని నిర్మించేందుకు అవసరమైన స్థలాన్ని కేటాయించాలని వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావును కోరారు. ఐఎంఏ ఆధ్వర్యంలో శనివారం మంత్రిని కలిసి వినతిపత్రం అందించారు. స్థల కేటాయింపు భవన నిర్మాణానికి సహకరించాలని అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమాకాంత్, ప్రణీత్, డాక్టర్ వెంకటేశ్వర్ రావు, వాసుదేవరెడ్డి, లక్ష్మణ్ పాల్గొన్నారు.



రంజాన్ సందర్భంగా జిల్లాకేంద్రంలోని ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



అలయ్‌బలయ్ తీసుకుంటున్న మక్కాన్‌సింగ్



శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి



శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు

ఘనంగా రంజాన్

జిల్లావ్యాప్తంగా ముస్లింలు రంజాన్ వేడుకను ఘనంగా జరుపుకున్నారు. జిల్లాకేంద్రంలోని చందపల్లి ఈద్గావద్ద సామూహిక ప్రార్థనలు నిర్వహించారు.ఒకరినొకరు అలయ్ బలయ్ తీసుకుని ఈద్‌ముబారక్ చెప్పుకున్నారు. ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు, ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. గోదావరిఖనిలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ ముస్లింలతో కలిసి ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ పవిత్రతను మతపెద్దలు వివరించారు. – సాక్షి, నెట్‌వర్క్

స్కేటింగ్ క్రీడాకారుడికి ఎన్నారై బాసట

కోల్‌సిటీ: కరీంనగర్ ఉమ్మడి జిల్లా స్థాయి రోలర్ స్కేటింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో బంగారు పతకం సాధించిన గోదావరిఖనికి చెందిన సూరంపూడి వేణుసాయి ఈనెల 26 నుంచి 30 వరకు పంజాబ్ రాష్ట్రం మొహాలీలో జరిగే జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీల్లో రాష్ట్రం తరఫున పాల్గొనను న్నాడు. అయితే పేద కుటుంబంలో పుట్టిన వేణుసాయి ఆర్థిక స్థితిగతుల దృష్ట్యా పంజాబ్ వెల్లడానికి ఇబ్బంది పడుతున్నాడు. అతడి పరిస్థితిని తన మిత్రులు సామాజిక కార్యకర్త, ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి గడప శ్రీకాంత్‌కు వివరించగా స్పందించిన పలు స్వచ్ఛంద సంస్థల సహాయం కోరారు. విదేశాల్లో వైద్యవృత్తిలో ఉన్న డాక్టర్ అద్దంకి శరత్ ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేష్ ద్వారా తెలుసుకుని తనవంతుగా రూ.30వేలు సహాయం చేశారు. స్వచ్ఛంధ సంస్థల బాధ్యులు శరత్‌కు అభినందనలు తెలిపారు. వేణుసాయిని సన్మానించారు. ఆర్ష ఫౌండేషన్ నిర్వాహకులు బూడిద హర్ష, స్వచ్ఛంధ సంఘాల నాయకులు రేణుకుంట్ల నరేంద్ర, ఆలూరి సుధీర్, వెంకటేష్, మండల శ్రీను పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఈజీఎస్ సిబ్బందికి పే స్కేల్ వర్తింపజేయాలి


వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: ఉపాధి హామీ సిబ్బందికి పేస్కేల్ వర్తింపజేసేలా ప్రభుత్వం ఆదేశాలిచ్చేలా చూడాలని ఈజీఎస్ జేఏసీ నాయకులు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావును కలిసి విన్నవించారు. శనివారం ఈ మేరకు వినతిపత్రం అందించినట్లు జేఏసీ చైర్మన్ వెంకటేశ్‌గౌడ్ తెలిపారు. కో–కన్వీనర్ రాజయ్య ఉన్నారు.

శ్రీచాత్తాద వైష్ణవ సంఘం జిల్లా అధ్యక్షుడిగా సుమన్


సుమన్

ధర్మారం: శ్రీచాత్తాద శ్రీవైష్ణవ సంఘం జిల్లా అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన బండవరం సుమన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర నాయకులు పీటీ.స్వామి అధ్యక్షతన సంఘం సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. పలు సమస్యలపై చర్చించారు. అనంతరం కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా గరిమెళ్ల శ్రీనివాస్‌మూర్తి, కోశాధికారిగా బండవరం శ్రీనివాస్ ఏకగ్రీవమైనట్లు స్వామి తెలిపారు.

బైండోవర్ ఉల్లంఘించిన వ్యక్తికి రిమాండ్

సుల్తానాబాద్/కాల్వశ్రీరాంపూర్: బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించిన కాల్వశ్రీరాంపూర్ మండలం పెగడపల్లికి చెందిన సంపంగి మహేశ్‌ను కరీంనగర్ జైలుకు తరలించినట్లు ఎక్సైజ్ సీఐ ఆనందరావు తెలిపారు. మహేశ్ గతేడాది నాటుసారా తయారు చేస్తూ పట్టుబడగా.. తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. అయినప్పటికీ అతడిలో మార్పు రాలేదు. అదే నేరం చేస్తూ ఎక్సైజ్ అధికారులకు పట్టుబడ్డాడు. జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్.మహిపాల్ రెడ్డి ఆదేశాల మేరకు మహేశ్‌ను తాజాగా కాల్వశ్రీరాంపూర్ తహసీల్దారు ఎదుట హాజరుపరిచారు. ఆయన విచారణ చేపట్టి జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. అతడిని అరెస్టు చేసి కరీంనగర్ జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు.

ఏడాదైనా డిమాండ్లు తీరలే..!

- అటకెక్కిన కార్మికుల మారుపేర్ల మార్పు
- 13 డిమాండ్లు.. పరిష్కరించింది కొన్నే
- యూనియన్ల తీరుపై కార్మికుల ఆగ్రహం

గోదావరిఖని: సంస్థ రక్షణ.. కార్మికుల సంక్షేమానికి కార్మికసంఘాలు, యాజమాన్యం మధ్య ఏడాది క్రితం కుదిరిన ఒప్పందం కాగితాలకే పరిమితమైంది. సమస్యలు పరిష్కరించాలని జాతీయ కార్మిక సంఘాలు, గుర్తింపు యూనియన్ 2021 డిసెంబర్ 9, 10, 11 తేదీల్లో మూడురోజులపాటు సమ్మె చేశాయి. దిగొచ్చిన యాజమాన్యం కార్మిక సంఘాల జేఏసీతో చర్చలు జరిపి 13 డిమాండ్లలో తొమ్మిదింటికి అంగీకరించింది. 13 డిమాండ్లపై మొదటిసారి ఆర్‌ఎల్‌సీ సమక్షంలో చర్చలు జరిపినా పూర్తిస్థాయిలో అవగాహనకు రాలేదు. ఫిబ్రవరిలో జరిపిన చర్చల్లో కొన్ని డిమాండ్లకు అంగీకారానికి వచ్చినా లిఖితపూర్వక ఒప్పందానికి మళ్లీ సమావేశం కావాలని నిర్ణయించారు. మార్చి, ఏప్రిల్‌లో సమావేశం కావాలని నిర్ణయించినా వాయిదా పడ్డాయి. తిరిగి 2022 ఏప్రిల్ 19, 20 తేదీల్లో జరిగిన చర్చలు ఫలప్రదం అయ్యాయి. 13 కీలక డిమాండ్లలో తొమ్మిది డిమాండ్లకు యాజమాన్యం అంగీకారం తెలిపింది. మరోనాలుగు డిమాండ్లను రాబోయే రోజుల్లో తిరిగి పొందుపర్చుకునే అవకాశం కల్పించారు. అయితే అవి నేటికీ అమలుకు నోచుకోలేదు. మణుగూరు ఏరియాలో డంపర్ ప్రమాదం కారణంతో డిస్మిస్ అయిన ఈపీ ఆపరేటర్‌కు తిరిగి ఉద్యోగం మినహా మిగితా ఏ ఒక్కటీ పరిష్కారానికి నోచలేదు.


యాజమాన్యంతో చర్చిస్తున్న కార్మిక సంఘాల నేతలు(ఫైల్)

ఎన్నికలా..? డిమాండ్ల పరిష్కారమా..?

సింగరేణిలో ఎన్నికల జోష్ పెరిగిన నేపథ్యంలో కార్మిక సంఘాలు డిమాండ్లపై నోరు మెదపడం లేదు. గుర్తింపు యూనియన్, జాతీయ కార్మిక సంఘాలు దీనిపై యాజమాన్యాన్ని నిలదీసిన దాఖలాలు లేవు. సీఐటీయూ మాత్రం అంగీకరించిన డిమాండ్లను పరిష్కరించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని పట్టుపట్టింది. అయినా యాజమాన్యంలో కదలిక రాలేదు. సమ్మె చేసి సాధించుకున్న డిమాండ్లను పరిష్కరించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని కార్మిక వర్గం డిమాండ్ చేస్తోంది. గుర్తింపు రాజకీయం కోసం తమను బలిచేస్తే ఊరుకునేది లేదని కార్మిక వర్గం స్పష్టం చేస్తోంది. గుర్తింపు యూనియన్ టీబీజీకేఎస్, మిగితా జాతీయ కార్మిక సంఘాలు యాజమాన్యంతో తాడోపేడో తేల్చుకోవాలని కార్మికులు కోరుతున్నారు.

అంగీకరించి.. అమలుకు నోచని డిమాండ్లు..

- సింగరేణిలో మారుపేర్లపై పనిచేసే వారు గెజిట్ పబ్లికేషన్ లేదా అఫిడవిట్ తెచ్చుకుంటే పేరు మార్పు.
- గని ప్రమాదంలో చనిపోయిన కార్మిక కుటుంబాలకు బ్యాంక్ ఇన్సూరెన్స్ ద్వారా రూ.40 లక్షలు తగ్గకుండా ఇప్పిస్తూ.. రూ.15లక్షల ఎక్స్‌గ్రేషియా, మ్యాచింగ్ గ్రాంట్ పెంచి రూ.కోటి వరకు ఇవ్వడం.
- పెండింగ్ డిపెండెంట్ల కేసులు పరిష్కారం.
- సింగరేణి కార్మికుడు, అతడి భార్య ఉద్యోగులైతే వారి పిల్లలకు డిపెండెంట్ ఉద్యోగం ఇచ్చే అవకాశం గతంలో లేదు. డిపెండెంట్‌లో ఒక్కరికి ఉద్యోగం కల్పించడం.
- కోవిడ్‌తో కార్మికుల పిల్లలకు 40 ఏళ్ల వరకూ వయస్సు సడలింపు.
- నాలుగు బొగ్గు బ్లాకులు సింగరేణికి ఇవ్వాలని మే10లోపు యాజమాన్యం ద్వారా కార్మిక సంఘాల నేతలను ఢిల్లీలో బొగ్గుగనుల శాఖామంత్రి వద్దకు తీసుకెళ్లడం.
- ఈపీ ఆపరేటర్లు, ఈఎం టెక్నీషియన్లు అన్‌ఫిట్ అయితే సర్వీస్‌లో అదే డిజిగ్నేషన్‌తో ఇంటర్నల్ కమిటీ వేసి 60రోజుల్లో చర్చించి పరిష్కరించడం.

పంట నష్టపరిహారం రూ.6.91కోట్లు


ఎలిగేడులో మొక్కజొన్న పంటలను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

- 6,910 ఎకరాల్లో పంట నష్టపోయినట్లు నిర్ధారణ
- ఎకరాకు రూ.10వేల చొప్పున రైతు ఖాతాల్లో జమ
- జిల్లాలోని ఎలిగేడు మండలంలోనే ఎక్కువ నష్టం

పెద్దపల్లిరూరల్: ఇటీవల కురిసిన అకాలవర్షాలకు జిల్లాలో 6,910 ఎకరాల్లో పంటలు నష్టపోయినట్లు వ్యవసాయ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. ఎనిమిది మండలాలు.. 64 గ్రామాల్లోని 5,790 మంది రైతులు పంటలను కోల్పోయారు. నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.10వేల చొప్పున పరిహారం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెల్సిందే. ఈ లెక్కన జిల్లా రైతులకు రూ.6.91కోట్ల పరిహారం అందనుంది. జిల్లాలో అత్యధికంగా ఎలిగేడు మండలంలో 2,401 మంది రైతులు 4,693 ఎకరాల్లో పంటలు నష్టపోయారు. అత్యల్పంగా పెద్దపల్లి మండలంలో కేవలం ఇద్దరు రైతుల రెండెకరాల్లో పంట నష్టం జరిగింది.

ఎకరాకు రూ.10వేల పరిహారం

పంటలు నష్టపోయిన రైతులను ఆదుకుంటామన్న సీఎం కేసీఆర్.. ఎకరాకు రూ.10వేల చొప్పున పరిహారం ప్రకటించిన విషయం విదితమే. ఈ మేరకు జిల్లావ్యాప్తంగా నష్టపోయిన పంటల వివరాలను వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నిర్ధారించారు. మొత్తంగా 6,910 ఎకరాల్లో పంటలు నష్టపోగా.. ఇందులో 5,226 ఎకరాల్లో వరి, 13,780 ఎకరాల్లో మొక్కజొన్న, 304 ఎకరాల్లో ఇతర పంటలు ఉన్నాయని అధికారులు ప్రభుత్వానికి నివేదించారు.

ఎలిగేడులోనే ఎక్కువనష్టం..

ఎలిగేడు మండలంలో 8గ్రామాలకు చెందిన 2,401మంది 4,693 ఎకరాలోలపంటలు నష్టపోయారు. తర్వాత ఓదెలలో 11 గ్రామాలు, 1,609 మంది 915 ఎకరాలు, సుల్తానాబాద్‌లోని 18 గ్రామాలు, 819 మంది 647 ఎకరాలు, కాల్వశ్రీరాంపూర్‌లో 334 ఎకరాలు, జూలపల్లిలో 238 ఎకరాలు, ముత్తారంలో 76 ఎకరాలు, ధర్మారం మండలం కొత్తూరులో 11 ఎకరాల్లో నష్టపోయారు.

పరిహారం నేరుగా రైతు ఖాతాల్లోకే..



అకాలవర్షాలకు పంటలు నష్టపోయిన రైతుల వివరాలను ప్రభుత్వానికి నివేదించాం. పరిహారం సొమ్ము విడుదల కాగానే నేరుగా రైతు ఖాతాలో జమవుతుంది. ఎలిగేడు మండలంలోనే ఎక్కువ పంటనష్టం జరిగింది.

– ఆదిరెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి

నూతన ప్రజాస్వామిక విప్లవం కోసం పోరాటం

- ఉమ్మడి జిల్లా కార్యదర్శి కె.రాజన్న

గోదావరిఖని: నూతన ప్రజాస్వామిక విప్లవం కోసం పోరాటం చేయాలని కరీంనగర్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి కె.రాజన్న పిలుపునిచ్చారు. శనివారం లెనిన్ 153వ జయంతిని స్థానిక ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో నిర్వహించారు. దోపిడీ వ్యవస్థను నిర్మూలించి దాని స్థానంలో నూతన ప్రజాస్వామిక విప్లవంతోనే భూమి, భుక్తి, విముక్తి సాధ్యమన్నారు. ప్రజల విముక్తి కోసం వీరోచితంగా పోరాడి అసువులు బాసిన లెనిన్‌కు రెండు నిమిషాలు మౌనం పాటించి జోహార్లు అర్పించారు. కార్యక్రమానికి సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు నరేశ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు చిలుక శంకర్, ఎం.దుర్గయ్య, కె.మొగిలి, బి.బుచ్చయ్య, వి.సదానందం, కె.లింగమూర్తి, మహేందర్, బొట్టు రవికుమార్, మంగ, రజిత, మొండన్న, సుధాకర్, సాంబయ్య, నర్సయ్య, గుండు రాజయ్య, ఆర్.రాయమల్లు, బాలకృష్ణ, మధూకర్, అన్వేశ్, శ్రావణ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కె.రాజన్న

లెనిన్ పోరాట స్ఫూర్తితో పేదలకు ఇళ్ల స్థలాలు

గోదావరిఖని: లెనిల్ పోరాట స్ఫూర్తితో పేదలకు ఇళ్ల స్థలాలు సాధించుకుందామని సీపీఎం రాష్ట్ర నేత భూపాల్ తెలిపారు. స్థానిక రాజ్యలక్ష్మి ఫంక్షన్‌హాల్‌లో భూపోరాట కేంద్రాల కార్యకర్తల రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా లెనిన్ 153వ జయంతిని నిర్వహించారు. పాలకులు ప్రజలను ఎలా గౌరవించాలో ఆచరణలో నిరూపించిన లెనిన్ మార్గం విలువైందన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం దేశ అభివృద్ధికి కాకుండా సంపదను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతోందన్నారు. పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని పార్టీ ఆధ్వర్యంలో భూపోరాటాలు చేస్తున్నామని తెలిపారు. నాయకులు ముత్యంరావు, వై.యాకయ్య, ఎం.రామాచారి, లావణ్య, భిక్షపతి, నాగమణి, ఉపేందర్, సంజీవ్, నాగలక్ష్మి, లక్ష్మారెడ్డి, ఉపేందర్ పాల్గొన్నారు.

సైద్ధాంతికకర్త లెనిన్

జ్యోతినగర్: కమ్యూనిస్టు విప్లవోద్యమ సైద్ధాంతిక కర్త లెనిన్ అని సీపీఐ(ఎంఎల్)ప్రజాపంథా ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్ అన్నారు. ఆటోనగర్‌లోని యూనియన్ కార్యాలయంలో లెనిన్‌కు నివాళులర్పించారు. మోదీ తీసుకొస్తున్న ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడాలన్నారు. డివిజన్ కార్యదర్శి తోకల రమేశ్, నాయకులు గుమ్మడి వెంకన్న, అడేపు శంకర్, కోడిపుంజుల లక్ష్మీ, చంద్రయ్యతో ఉన్నారు.

పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి

యైటింక్లయిన్‌కాలనీ: పోడు భూములు సాగు చేసుకుంటున్న వారికి పట్టా ఇవ్వాలని సీపీఎం(ఎంఎల్) న్యూడెమోక్రసి జిల్లా నాయకులు బి.అశోక్ అన్నారు. స్థానిక ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో లెనిన్‌కు నివాళి అర్పించారు. నాయకులు రాజనర్సు, బుచ్చమ్మ, లింగయ్య, ప్రేమ్ కుమార్, శారద, లత, కవిత, రమ, కళావతి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల ఆరోగ్యంపై యాజమాన్యం నిర్లక్ష్యం

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి కార్మికుల ఆరోగ్యంపై యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఏఐటీయూసీ ఉప కార్యదర్శి వైవీ.రావు అన్నారు. శనివారం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్ కాలనీ ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు. కార్మిక కుటుంబాలు సింగరేణి ఆసుపత్రికి వెళ్తే సరైన ట్రీట్మెంట్, మందులు ఇవ్వడం లేదని ఆరోపించారు. ఓసీపీ–1లో విధులు నిర్వహిస్తున్న ఆపరేటర్ తల్లిని సింగరేణి ఆసుపత్రిలో చేర్పిస్తే హైదరాబాద్‌కు రెఫర్ చేస్తున్నారని తెలిపారు. మెడికల్ బిల్లులు పెట్టుకుని ఎంతోమంది కార్మికులు ఏళ్ల తరబడి బిల్లు రాక ఎదురుచుస్తున్నారని పేర్కొన్నారు. యాజమాన్యం స్పందించి సింగరేణి ఆసుపత్రిల్లో సరైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ఎల్.ప్రకాశ్, బ్రాంచ్ కార్యదర్శి రాజారత్నం, రాంచందర్, తిరుపతి, సమ్మయ్య, శ్రీనివాస్, రాములు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు వైవీ.రావు

బదిలీపై వెళ్తున్న అధికారికి సన్మానం

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–1 పరిధి జీడీకే–5 ఓసీపీ మేనేజర్‌గా పనిచేస్తూ ప్రాజెక్టు అధికారిగా పదోన్నతిపై ఆర్కే ఓసీపీకి వెళ్తున్న గోవిందరావును శనివారం ఘనంగా సన్మానించారు. జీఎం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో శాలువాలతో సన్మానించి జ్ఞాపికను బహూకరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జీఎం చంద్రశేఖర్, ఏరియా ఇంజినీర్ రాంమూర్తి, ఎస్‌ఓటూ జీఎం రాంమోహనస్, చిలుక శ్రీనివాస్, రామక్రిష్ణ, నరేస్‌చక్రవర్తి, ఆంజనేయులు, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.


సన్మానిస్తున్న అధికారులు

గోదావరినదిలో దూకేందుకు యత్నించిన విశ్రాంత ఉపాధ్యాయురాలు

యైటింక్లయిన్‌కాలనీ: గోదావరి బ్రిడ్జిపై నుంచి నదిలోకి దూకేందుకు ప్రయత్నించిన ఓ రిటైర్డ్ ఉపాధ్యాయురాలిని రివర్ పోలీసులు కాపాడారు. టూటౌన్, రివర్ పోలీసుల కథనం ప్రకారం మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయురాలు కొంతకాలంగా కుటుంబసమస్యలతో బాధపడుతోంది. శనివారం గోదావరి బ్రిడ్జి వద్దకు వచ్చి నదిలో దూకేందుకు యత్నించగా అక్కడే విధులు నిర్వహిస్తున్న రివర్‌గార్డ్ సదానందం, అటువైపు వెళ్తున్న విద్యార్థి సంఘం నాయకుడు రాజ్‌తో కలసి ఆమెను అడ్డుకున్నారు. కౌన్సెలింగ్ నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. సమస్యలకు ఆత్మహత్య పరిష్కారం కాదని టూటౌన్ సీఐ వేణుగోపాల్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

హుజూరాబాద్ రూరల్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సింగాపూర్ గ్రామంలోని బస్టాప్ వద్ద గ్రామానికి చెందిన ముద్రవేని సదానందం, హుజూరాబాద్‌కు చెందిన వంగ కరుణాకర్ ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా 108లో ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

కరీంనగర్ క్రైం: పురుగుల మందు తాగి ఆత్మాహత్యా యత్నానికి యత్నించిన ఓ వివాహిత చికిత్స పొందుతూ మృతిచెందింది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలం కోనసముద్రంకు చెందిన భార్గవి (24)కి నగరంలోని గౌతమినగర్‌కు చెందిన గొలపల్లి రాజు అలియాస్ సాగర్‌తో 2018లో ప్రేమ వివాహం జరిగింది. కొంత కాలంగా భర్త, అత్త, ఆడపడుచు వారు కట్నం కోసం వేధిస్తున్నారు. ఈనెల 20న మళ్లీ వేధించడంతో మార్కెట్ సమీపంలోని ఓ లాడ్జి వద్ద పురుగుల మందు తాగింది. స్థానికులు చికిత్స నిమిత్తం 108లో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. భార్గవి కుటుంబ సభ్యులు కరీంనగర్‌కు వచ్చి నిజామాబాద్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి ఆమె మృతిచెందింది. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

తాటి చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడి మృతి

జమ్మికుంట: తాటి చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు మృతిచెందాడు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కోరపల్లి గ్రామానికి చెందిన మొగిలిపాక రాజయ్య (61) శనివారం సాయంత్రం కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కుతుండగా కింద పడిపోయాడు. చుట్టుపక్కల వారు గమనించి చికిత్స నిమిత్తం జమ్మికుంటకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హుజూరాబాద్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య రమ, కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతుడి భార్య రమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ బొర్రాటి రమేశ్ తెలిపారు.

ఉత్తమ నటిగా జనగామ సురేఖ


ఉత్తమ నటి అవార్డు అందుకుంటున్న సురేఖ

గోదావరిఖనిటౌన్: మూవీ ఆర్టిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లో సారథి స్టూడియోస్ అవార్డు ప్రదానోత్సవంలో గోదావరిఖనికి చెందిన జనగామ సురేఖ లఘు చిత్ర ఉత్తమ నటిగా అవార్డు అందుకున్నారు.

అదే నిర్లక్ష్యం.. పొంచి ఉన్న ప్రమాదం..!

- విద్యుత్ వైర్ల సామర్థ్యానికి మించి ఏసీల ఏర్పాటు
- బల్దియా కార్యాలయంలో కానరాని ఫైర్‌సేఫ్టీ పరికరాలు
- 8 ఏళ్ల క్రితం షార్ట్ సర్క్యూట్‌తో కాలిన మేయర్ చాంబర్

కోల్‌సిటీ (రామగుండం): రామగుండం కార్పొరేషన్ కార్యాలయానికి షార్ట్‌సర్క్యూట్ ప్రమాదం పొంచి ఉంది. విద్యుత్ వైర్ల సామర్థ్యానికి మించి విచ్చలవిడిగా ఏ సీలు ఏర్పాటు చేస్తుండడమే ఇందుకు కారణం. 20 ఏళ్ల క్రితం వేసిన విద్యుత్ వైర్లతోనే కరెంట్ సరఫరా అవుతోంది. ఈ క్రమంలో ఎనిమిదేళ్ల క్రితమే మేయర్ చాంబర్‌లో ఏసీ షార్ట్ సర్క్యూట్ అయి చాంబర్ కాలిబూడిదైంది. ఆ సంఘటన ఇంకా కళ్లముందే కదలాడుతోంది. అయినప్పటికీ అధికారుల్లో మాత్రం మార్పు రాలేదు. పాత కేబుళ్ల వద్ద ఏసీ పాయింట్ లేకపోవడంతో ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లకు ఇచ్చే కనెక్షన్‌ను ఏసీలకు ఇస్తున్నారని తెలిసింది.

ఫైర్‌సేఫ్టీ పరికరాలేవీ..?

బల్దియా కార్యాలయంలో ఫైర్‌సేఫ్టీ పరికరాలు లేవు. ఏదైనా ప్రమాదం సంభవిస్తే ప్రాణనష్టం వాటిల్లే అవకాశముంది. పైగా కార్యాలయం ఆవరణలోనే బ్యాంకు, ఏటీఎం కేంద్రం ఉన్నాయి. ప్రమాదం సంభవిస్తే నగదు, రికార్డులకూ నష్టం వాటిల్లనుంది. మంటలు ఆర్పేందుకు ఎలాంటి పరికరాలు లేకపోవడంతో స్థానికంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఏ గదిలో చూసినా ఏసీలే..

ఇటీవల ప్రతి గదిలో ఏసీలు బిగిస్తున్నారు. భవనం ప్రారంభించినప్పుడు కేవలం మేయర్ ఛాంబర్, కంప్యూటర్ ల్యాబ్‌లో మాత్రమే ఏసీలు ఉండగా.. ఇప్పుడు దాదాపు అన్ని విభాగాల్లోనూ దర్శనమిస్తున్నాయి. మొత్తంగా కార్యాలయంలో 15 వరకు కొత్త ఏసీలు ఏర్పాట్లు చేసినట్లు తెలుస్తోంది. ఎండాకాలంలో అన్నిగదుల్లో ఎయిర్ కూలర్లు వాడేవారు. ఇప్పుడు కిందిస్థాయి అధికారులు, సిబ్బందికీ ఏసీలు ఏర్పాటు చేయడం విమర్శలకు తావిస్తోంది. ఏసీల సంఖ్య పెంచుతున్న విషయమై సంబంధిత ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ అధికారులను ప్రశ్నించగా తమ వద్ద వివరాలు లేవని వెల్లడించడం గమనార్హం. ఏసీలు బిగించేటప్పుడు విద్యుత్ కేబుల్ సామర్థ్యం.. ఏసీల పనితీరుపై ఎలక్ట్రికల్ అధికారుల నుంచి ధ్రువీకరణ చేసుకోవాల్సి ఉంటుంది. అవేవీ లేకుండానే ప్రైవేట్ వ్యక్తులతో కనెక్షన్ ఇప్పిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌పై భారం పడి తరచూ ట్రిప్ అవుతోంది. కరెంట్ పోతే జనరేటర్‌పై భారంపడే అవకాశముంది.



కాలిపోయిన మేయర్ చాంబర్‌ను పరిశీలిస్తున్న అప్పటి ఎమ్మెల్యే సత్యనారాయణ, మేయర్ లక్ష్మీనారాయణ(ఫైల్), ఓ గదిలో కొత్తగా ఏర్పాటు చేసిన ఏసీ